


# యాత్ర

జలంధర

**"పెళ్ళైన తరువాత నీ జీతం మాకిస్తావా? మీ వాళ్ళకిస్తావా?"**

గొంతులో వెటకారం, అధికారం. సన్నటి ముక్కుతో, నోటితో మాట్లాడుతూనే, నొసలు వెక్కిరించే ఆవిడ మాటలకు మరొక్కసారి తెల్లబోయింది అలకనంద.

అర్థంకానట్లు సుందర్ వంక అసహనంగా చూసింది. అతని కళ్ళల్లో నిస్సహాయత.

"నాకోసరం వీళ్ళను భరించవా?" అన్న అభ్యర్థన. ఇంజనీరింగ్ కాలేజీలో సహాయాధ్యులు సుందర్, అలకనంద. ఐదేళ్ళుగా "ప్రేమించుకుంటున్నాము" అనుకుంటున్న వాళ్ళిద్దరికీ నిజానికి ఒకరి వ్యక్తిత్వం ఒకరికి తెలియదు. సహం చెక్కిన శిల్పాలు.

ఆమెతో ఒంటరిగా ఉన్నప్పుడు ఆమె స్వతంత్ర్యాన్ని, స్పందనను చూసి ముచ్చటపడే అతను "పెళ్ళిమాటలు" ప్రారంభం అవగానే "మావాళ్ళు" అన్న మాయలో పడిపోయాడా?!

ప్రేమ ఇద్దరి వ్యక్తుల మధ్య అనుబంధం. పెళ్ళి రెండు కుటుంబాల సంబంధ బాంధవ్యం.

కానీ ఇక్కడ ఎక్కడా "బాంధవ్యం" కనిపించడంలేదు.

అతని తల్లి అడిగే ఈ ప్రశ్నతో అతని కళ్ళల్లోని నిస్సహాయతతో, వీళ్ళందరు కలిసి పెళ్ళిని ఎవరికీ లాభం లేని వ్యాపారంగా మారుస్తూ ఉంటే ఈ అజ్ఞానపు ప్రవాహంలో కొట్టుకుపోవడానికి ఆమె ఆలోచించలేని ఆడపిల్లకాదు. అలకనంద.

ఇద్దరు వ్యక్తులు ఆత్మీయులవడానికి ఇంత హంగామా, అహం ప్రదర్శన, అనవసరమైన తప్పులు అవసరమా? ఈ అజ్ఞాన, అవివేకానికి ఇప్పుడు తలవూపితే పెళ్ళి తరువాత కనీసం మూడు సంవత్సరాలు ఇద్దరి సంపాదన ఈ పెళ్ళి అనే ఆడంబరానికి అయిన అప్పులు తీర్చడానికి సరిపోతుంది.

అతనికి తల్లి అంటే భయమా?

ప్రేమ, భయం ఇవి సమానాంతరంగా ప్రయాణిస్తాయి. భయపెట్టి, బతికించాలనుకున్న వాళ్ళ పట్ల వినయం, వందనం ఉండవేమో.

అందమైన సున్నితమైన భావనలను హత్య చేసే ప్రయత్నానికి బలైపోవడం ఇష్టంలేదు ఆమెకు.

అందుకే నిశ్చితార్థం అనిశ్చితమైపోయింది.

అనంతమైన ఒంటరితనం ఆమె చుట్టూ ఆవరించింది. గదిలో ఏడుస్తూ పడుకున్నది. ఎందుకు? అహం దెబ్బతినా? మోసపోయాననా? తన నమ్మకం వమ్ము అయిందనా?

"యాత్రలు వెళుతున్నాం. వస్తావేమిటీ?" పక్కింటి అమ్మమ్మగారు ఆప్యాయంగా తలమీద చెయ్యివేసి అడిగారు.

సజల నయనాలతో తలెత్తి చూసింది అలకనంద. ఆవిడ వ్యక్తిత్వమన్నా, ఆప్యాయత అన్నా చాలా ఆరాధన ఆమెకు ఆందుకే ఆవిడ అడగడమే తరువాయి. ఎక్కడికి? ఏమిటి? అని అడగకుండా 'వస్తాను' అనేసింది.

నిశ్చితార్థమనుకుని పెట్టుకున్న గోరింటాకు, కొనుక్కున్న పట్టుచీర, మాచింగ్ గాజులు. విధి వెక్కిరింపు నుంచి పారిపోవాలి ఎక్కడికైనా సరే.

రైలులో కిటికీ పక్కన సీటు. ధారాపాతంగా ఆగకుండా కన్నీరు కారుస్తూనే ఉంది.

"నీ పేరుకు అర్థం తెలుసా?" చేతులో మైసూరుపాకు పెడుతూ అడిగారు అమ్మమ్మగారు.

"తెలియదు"

"అది గంగ పేరు. గంగ మొట్టమొదట దర్శనమిచ్చిన చోటు అలకనంద. నువ్వు గంగమ్మ తల్లివి. కన్నీళ్ళు గంగవి కాకూడదు"

ఆవిడ ఆప్యాయతకు మరింత కరిగిప్రవహిస్తోంది అలకనంద.

"అదుగో మొట్టమొదటి గంగ దర్శనం. నమస్కారం చేసుకో."

అమ్మమ్మగారి మాటలకు ఊహనుంచి బైటపడి అప్రయత్నంగా చేతులు జోడించింది.

చెప్పలేనంత ఎత్తున హిమవత్పర్వతాలు. అపూర్వ అనంత సౌందర్యం. యమున దర్శనం చేసి దిగివస్తూ.

"అదుగో ఆ దూరపు కొండగుహల్లో ఎంతమంది మహాత్ములో తపస్సు చేసుకుంటున్నారు. మానసిక నమస్కారం చేసుకో"

అరలు అరలుగా కొండచెరియలు. ఆ అరలలో ఎన్ని ఋషిపావురాలో. ఏవేవో దారులు. ఎక్కడికి వెళతాయి అవి? వారి పాదాలగుర్తులు ఉంటాయి కాబోలు -

కుంభమేళానాటికి ఎక్కడెక్కడినుంచో మహాత్ములు హరిద్వార్‌లో ప్రత్యక్షమవుతారు. ఏదారిన వస్తారో. ఎలా అదృశ్యమౌతారో తెలియదమ్మా? కారు డ్రైవర్ చెపుతున్నాడు.

గంగోత్రి దారి అద్భుతం.

"మానసికంగా ప్రేమతో ప్రార్థించు. గంగమ్మ నీతో మాట్లాడుతుంది. ఆవిడ మౌన గంగ మనం మాట్లాడనంతసేపూ" నవ్వుతూ చెప్పి కళ్ళుమూసికుని జపం చేసుకుంటున్నారు అమ్మమ్మగారు.

"నిజమా? నువ్వు మాట్లాడతావా?!" గంగను ప్రశ్నించింది ఆర్తితో అలకనంద.

మనసులో దుఃఖం, ఒంటరితనం. ఒకొక్కరి ఆర్ద్రతను ఇచ్చి, హృదయాన్ని స్పందింపచేసి ప్రకృతితో మమైకం అయ్యే అవకాశం అరుదుగా వస్తుంది.

అవి అమృత ఘడియలు.

ఆమె పక్కన ఏదో అనుభూతికి తప్ప అందని స్పర్శ.

ఎవరు?

"నేను గంగను" సన్నని నవ్వు.

చుట్టూచూసింది అలకనంద కంగారుగా. కార్లో అందరూ నిద్రపోతున్నారు ఒక్క డ్రైవరు తప్ప.

ఇది నిజమా? భ్రమా?!

స్ఫటికము, వెన్నెల కలబోసిన భ్రాంతిలాంటి వెలుగు అది రూపమా? కాదు అరూపమా? అవునేమో.

"భం భం భం. భం భం బోలే. జయగంగా మాతాజీ" గంగను ప్లాస్టిక్ డబ్బాలలో నింపుకుని మెడచుట్టూ తాడుతో వేలాడదీసుకుని భంభం నాదం చేస్తూ వారి ఊరి శివలింగానికి అభిషేకం చెయ్యడానికి పరుగులు పెడుతున్నారు చాలామంది.

"ఎంతగొప్ప సంస్కారమిది?"

"అలా చేస్తే వాళ్ళ ఊళ్ళు సుభిక్షంగా ఉంటాయన్న ప్రార్ధన అమ్మా అది. చాలా దూరంనుంచి, కచ్, కాశ్మీర్ నుంచి కూడా వస్తారు. రిలే ప్రయాణాలు చేస్తారు. కానీ గంగనుమాత్రం కిందపెట్టరు. అందులో చాలామంది చదువుకున్నవాళ్ళు ఇంజనీర్లు, డాక్టర్లు కూడా ఉంటారమ్మా!" డ్రైవర్ చెపుతున్నాడు.

స్టాటిక్ ఎనర్జీగా ఉండే లింగాన్ని కైనటిక్ ఎనర్జీగా ఏర్పడ్డ గంగను మంత్రమనే వైబ్రేషన్‌తో తాకగానే, డివైన్ మాగ్నటిజమ్ పుడుతుంది. అభిషేకానికి అంత పవిత్రత అందుకే" ఎప్పుడో లైఫ్ పాజిటివ్ మాగజైన్‌లో కాబోలు చదివిన విషయం గుర్తుకు వచ్చింది అలకనందకు.

ఆమె ముందు గంగ.. ఆమె పక్కన గంగ.. ఆమె మాత్రం కన్నీటి గంగ.

"హుఁ నేనూ విరహిణినే" నిట్టూర్చింది మందాకిని గంగ - గంగా హారతి పరమాద్భుత దృశ్యం.

అలకనందకు ఊహాదృశ్యకావ్యం చూపుతోంది కరుణాంతరంగ గంగ.

తొలి కిరణాలు గంగను తాకుతున్నాయి. జలచారిణి స్నిగ్ధ సౌందర్యమూర్తి ..!

"నేను ఒద్దా? నా బాధ నీకు తెలియదా? నన్ను పావని అంటారని, పవిత్రం చెయ్యమని నీకు దూరంగా పంపిస్తావా? ప్రతి పువ్వు, ప్రతి నవ్వు, ప్రతి కన్నీరు, ప్రతి దీపార్చన. గంగకు ఏది సమర్పించినా ప్రతి సమర్పణా తీసుకువచ్చి స్వామికి ధారగా పోటెత్తుతుంది. నీకు నిజంగా దూరమైనప్పుడు నాకు ఈ గుడులు ఎందుకు మందాకినీ?"

స్వామి ప్రశ్నకు ఒయ్యారంగా హొయలు చూపుతున్న ప్రేమమూర్తి గంగ వెనుతిరిగి చూసింది.

స్వామి కనులలో అదేమిటి?

కదిలిపోయింది జలజల.

జలరూప లింగానికి తన సర్వస్వంతో జలావరణ కలిపిస్తుంది.

గుడిలో శిలలో చైతన్యం.

శివం, శక్తి

"నేను సగం అయ్యాను. నువ్వు సంపూర్ణవయ్యావు - నేను నువ్వు కావాలనిపిస్తోంది. "అన్నది అమ్మ జగజ్జనని ఆశిస్తూ, ఆర్ద్రతగా ఒక్కరవ్వ అసూయగా -

జలజలా మిలమిలా నవ్వింది గంగ.

హిమవంతునిలో కదలిక. ఎటువంటి బిడ్డలు ఈ ఇద్దరు ఆయనకు.

"నేనూ నువ్వు ఒకటే. నిన్ను నన్ను ఒకటిగా మార్చింది ఏమిటో తెలుసా? స్వామి ప్రేమానుగ్రహం"

అమ్మవారు అడుగు వేసి గంగను ఆపబోయింది. ఆమె పాదాలకు అభిషేకం చేసి పారాణి సింధూరంగా పెట్టుకుని నవ్వింది గంగ.

"ఆర్ద్రాం పుష్కరిణీం"

ఉప్పొంగుతున్న గంగ ప్రతి అణువులోనూ ఆర్ద్రతే అర్ధమౌతోంది అమ్మవారికి.

"మరి దూరంగా వెళ్ళిపోతున్నావేం?" అమ్మ కళ్ళల్లో తడి - అసూయను కూడా కలిగించే కరుణాంతరంగ గంగ.

"వెళ్ళిపోతూంటే బాధగా లేదా?.." కొంత స్థూలత్వం విగ్రహం కదా మరి.

మాటర్‌కు, ఎనర్జీకి ఇదే తేడానా?! ఆలోచిస్తోంది అలకనంద.

"ఎక్కడికి వెళుతున్నాను? నువ్వు నేను లేని స్వామి.. శక్తిగా నువ్వు సహమైతే, స్వామి కరుణగా నేను ప్రవహిస్తున్నాను.

ప్రతి పుష్కరిణిలో నేనే. ప్రతి సౌందర్యపు పన్నీటి జల్లు వెనకాల నా ప్రేమే. క్షీరాభిషేకాల్లోని స్వచ్ఛత నాదే చందనాభిషేకాల పరిమళాన్ని నేనే. ప్రతి కరుణాశ్రువుల ప్రవాహంలో నేనే. ప్రతి భక్తుల పుకింతల కంటి తడిలో నా వెలుగే. నేను లేని ఏదీ లేదు. నేను కానిది ఏదీ నా స్వామిని తాకలేదు. ఇది గర్వం కాదు. అంతా మళ్ళీ కరిగి ప్రవహించడమే. కరుణే. నా స్వామి ఆశీర్వచనమిది. నేను ఆయన పనిమీదే ప్రవాహాన్ని అయ్యాను.

"కష్టంగా లేదూ?"

"ఉంటుంది. చాలా కష్టం. కానీ, శరీరంలోని స్థూలత్వంలో బందీ అయిపోవడం కన్నా ఈ బాధా ప్రయాణం నాకు వరమే. కొండరాళ్ళను దాటుకుంటూ, కరుణ, దయ లేకుండా అడ్డం పడే బండరాళ్ళను పగలకొట్టుకుంటూ భగవంతుడి చైతన్యాన్ని, స్ఫూర్తిని ఈ మంచి ప్రవాహాల ఆవలి ఒడ్డువారికి విజ్ఞాన జలాలను అందివ్వమని నా స్వామి శాశనం.."

ప్రవహిస్తోంది అనేక రూపాలుగా.

కొన్ని చోట్ల సంకల్ప స్నానాలు, కొన్ని చొట్ల సంప్రోక్షం. అలకనందతో మౌన సంభాషణ చేస్తూనే ఉన్నది ఆ సిద్ధ గంగ.

"ఈ అనంత గంగా ప్రవాహంలో స్వామిని చూడాలని అనిపించదా అప్పుడప్పుడు?" అడిగింది అలకనంద.

"అనిపిస్తుంది. నాలో జలచైతన్యం ఆయనే అయినా చైతన్య దర్శనం చేయగల శక్తి నాకు ఉన్నా, ఆగి సేద తీర్చుకోవాలనిపించినప్పుడు, ఈ భయంకర అజ్ఞానపు కొండల్ని నేను దాటలేనేమో, ఈ చీకటి అడవుల్ని చీల్చలేనేమో అనిపించినప్పుడు నా స్వామి ఏదో రూపంలో దర్శనమిస్తారు. మళ్ళీ అభిషేక జలంగా మారి, జలశరీరంతో స్పందించి, ఆ చైతన్యం మూటకట్టుకుని, ఈ పర్వతాలను, చీకటి లోయలను దాటి మళ్ళీ పరుగు అందుకుంటాను. నా ఊపు, నా ఊపిరి, నా తపన, నా తపస్సు. అన్నీ నా స్వామే."

"నీకు అలుపు అనిపించదా?"

నవ్వింది గంగ. "కిరణాల వెలుతురులో తేజఃకాంతి గంగ ప్రేమ, ఆరాధన తెలుస్తే అలుపు, అలసట, అలసత్వం - ఇవి అడ్డం రావు. "

భౌతిక ప్రయాణంతో పాటు. అంతర్వాణిగా గంగా పరిక్రమణ జరుగుతున్నట్లు ఉన్నది అలకనందకు.

పంచకేదారాల్లో పవిత్రగంగ.

చలికాలంలో ఉఖీమఠ్‌లో రావల్ (మఠాధిపతి) కెదారనాథ్, తుంగనాథ్, మదమహేశ్వర్, రుద్రనాథ్, కపలేశ్వరులను లింగరూపంలో ఆరాధిస్తారు.

అక్కడే ఉషా అనిరుద్ధుల వివాహస్థలం. లోపలి ద్వారం దాటితే చండి స్థానం.

"ఇక్కడ అమ్మవారు కనిపిస్తున్నారు" అని ధ్యానంలోకి వెళ్ళిపోయారు అమ్మమ్మగారు.

తీర్థం - యాత్ర.

భగీరథుడు శివుడిని ప్రార్థించిన చోటు, గంగ భూమిని మొదటిసారి స్పృజించిన చోటు. గంగ గుడి. తెల్ల గ్రనైట్‌తో పద్దెనిమిదవ శతాబ్దంలో గోర్ఖా కమాండర్ అమర్ సింగ్ థాపా కట్టించాడని ప్రతీతి.

అక్కడి జనాలకు గంగ వారి ఆడబడుచు. ముఖ్బా అనే చోటుకు గంగాదేవి తన సీతాకాలం విడిదిగా వెళ్ళిపోతుందంటారు.

గంగ అన్ని జన్మల పాపాలను కడిగివేస్తుంది. బ్రహ్మహత్యాపాతకం పోవడానికి విష్ణువే అందులో స్నానం చేశారు.

బీటిల్స్‌లో ఒకడైన జార్జ్ హారిసన్, తన చితాభస్మాన్ని గంగలో కలపమని కోరాడట.

పతితపావని గంగ.

గంగాస్నానంతో జీవాత్మకు ఆవరించిన అనేక ఆవరణాల భ్రాంతిని తొలగించగలదట.

శివుడు ప్రపంచాన్ని రక్షించడానికి దావానలాన్ని మింగినప్పుడు కేదార గంగ పానంగా గ్రహించి అమృతమూర్తిగా, మృత్యుంజయుడు అయ్యాడని ప్రతీతి. ఆయనతో ప్రవహించిన గంగ జరామరణ నాసినిగా ఆశీర్వచనం పొందింది మరి.

మామ్మగారు చాలా విషయాలు చెపుతున్నారు. మల్టినేషనల్ మార్కెటింగ్ టెక్నిక్‌లు మనదేశం మీద ఎంతటి ముద్రవేసిందంటే, హిమాలయ స్నాయువుల్లో మనకు లభించేది మాగీ నూడుల్స్, కొకొకోలా వగైరా పానీయాలు.

"ఇక్కడివాళ్ళకు అది స్టేపుల్ ఫుడ్ అమ్మా!" అన్నాడు డ్రైవర్.

"ఏమైంది నా దేశానికి? " మొట్టమొదటిసారిగా ఇలా ఆలోచిస్తోంది అలకనంద.

"ఇన్ని దేశాలు, ఇన్ని తీరాలు, ఇన్ని స్నానఘట్టాలు ఇదంతా గంగా సామ్రాజ్యం అని గర్వంగా అనిపించదా అమ్మా?" అడిగింది అలకనంద.

ఫక్కున నవ్వింది ఆ స్నిగ్ధ సౌందర్య ప్రవాహం. "ఈ సర్వచైతన్యం నా స్వామిది. ఇందులో నా సొంతం ఏమున్నది? ఇదంతా నాదే కానీ నాది మాత్రమే అనిపించదు."

"ప్రవాహాన్ని నేను నాకు ఒడ్డు ఏమిటి?! ఎవరైనా, ఎక్కడైనా నాది, నాది అంటే నాకు కంపరమొస్తుంది. గట్లు తెంచేస్తాను. ఇదేనా బ్రతుకు" - అని కోపిన చట్రాలలో జీవులు ఇరుక్కుపోతే నేను విశ్వరూపందాలుస్తాను" అరుణ కాంతుల్లో ఉప్పొంగుతూ అన్నది గంగ.

"నువ్వు ఉప్పొంగితే సర్వం కోల్పోతారు కదమ్మా! ఎన్ని రకరకాల సంస్కృతులు గంగపాలు అయ్యాయికదా" నిష్ఠూరంగా అన్నది అలకనంద.

అట్టహాసం చేసింది గంగ.

"పేదరికం, కాపీనం, కూడబెట్టడం, కక్కుర్తి, పంచుకోలేకపోవటం, మనుష్యుల్ని స్వేచ్ఛ లేకుండా, ఊపిరాడనీయని సాంఘిక ఆడంబరాలు అసలు మనుష్యులు ఎందెందెందులో కొట్టుకుపోతారో తెలుసా?!

ఈ తెచ్చి పెట్టుకున్న శోకాలు, దుఃఖాలు నిజమనుకున్నప్పుడల్లా భూమాత కంపించిపోతుంది. నేను ఉప్పొంగిపోతాను

భయపెట్టే ఈ మూర్ఖపు సంస్కృతుల్ని గంగపాలు చేస్తే మళ్ళీ ప్రేమప్రవాహాలు దర్శనమిస్తాయి.

ఆ జలాక్షువులలో మహిషాసుర మర్ధిని విస్ఫోటకదర్శనం వణికిపోయింది అలకనంద.

కట్నాల చావులు, కోడళ్ళ కన్నీరు ప్రవాహంగా మారి గుజరాత్ లాంటి ప్రదేశాలను ముంచెత్తేది నువ్వేనా? అంటే ఏమంటుందో?!

ఇలా ఎన్ని పాపాలను తను ఉప్పెనగా మారి శుభ్రజలాలతో పునీతం చేస్తుందో ఈ తల్లి?!

"భయపడకు.. మార్పు మామూలుగా రాదు. ప్రతి జలప్రళయం తరువాత గమనిస్తే ఆ తీరప్రాంతంలో నూతన చైతన్యాన్ని, జ్ఞానాన్ని గమనించగలుగుతావు. "మంచి మనుష్యులు" అనుకుంటూ "మట్టిమనుష్యులుగా" మారితే, "అనుగ్రహాలను" "విగ్రహాలు"గా మార్చి స్వార్థపు పూజలు చేస్తే, అక్కడ స్వామి చైతన్యం ఉపహరించుకుంటాడు. పుష్కరిణిని నేను మాయమౌతాను.. అప్పుడు గుళ్ళు కూడా గంగమ్మపాలు అవుతాయి. తప్పదు" ఉరిమింది గంగమ్మ.

కాసేపటికి శాంతించింది.

"ఈ హిమాలయాలు చైతన్య గుహల్లో మహాత్ముల ధ్యాన కారుణ్యాన్ని, శాంతిని నా ప్రతి ప్రవాహంలో ప్రవర్తిల్లజేస్తారు" అది ఎంతమందికి అర్థమౌతుంది?!

వనిత, జలవనిత... ప్రేమకు స్పర్శకు స్పందిస్తాయి? నేను జలవనితను. స్పర్శతో, స్పందనతో, అనురాగంతో పులకిస్తాను. భూమిపై మూడువంతులు జలమే. మనిషి శరీరంలోను ఎక్కువభాగం జలమే! కానీ మనిషి కాపినంతో కరుడుగట్టి పోతాడు. దురాశతో రోగభూయిష్టం అవుతాడు. తన సౌందర్య ప్రపంచాన్ని తానే ధ్వంసం చేసుకుంటాడు. తన ఆబతో ఆర్ద్రత మర్చిపోయి శిల అవుతాడు. అది తనే భరించలేడు. శివత్వం మృగ్యమైన శవాలను నాలోకి తోసేస్తే వాటిని పంచభూతాలకు సమర్పించే ప్రక్రియ ఎంత కష్టమో తెలుసా?!

మహా సుజల గంగా ప్రవాహం మనిషి ఆలోచనలతోనూ, అభిచారినీ దురాశా మంత్ర స్పర్శతో కలుషితమైపోతుంది. అప్పుడు తప్పదు నాకు. జలప్రళయంగా మారిపోతాను. అర్థమౌతోంది ఆవిడ వ్యధ అలకనందకు. ఫాక్టరీల తాలూకు ఎంత కలుష రసాయనాలు గంగలో కలుపుతున్నారు?

కొన్ని చోట్ల గంగా ప్రవాహాన్ని తట్టుకోవడానికి గొలుసులు కట్టారు.

"ఏమిటమ్మా ఇది? " అంటే పకపకా నవ్వుతూ కాంతి ముత్యాల వెల్లువైంది చిద్విలాసిని గంగ.

"నా నుంచి తీసుకోవలసిన అద్భుతాలను తీసుకోకుండా, ఆశల్ని నా స్వామికి చెప్పి, పాపాలను నాకు ఇచ్చి వెళ్ళే ఈ భక్త జనాన్ని ఏమనాలి? మేము ఇచ్చే రక్షణ కవచాలను వదిలించుకున్న కాపీన లేపనాల్ని పూసుకుని వెళతారు. మేము ఇవ్వగలిగిన వాటి మీదనమ్మకం లేదు. వాళ్ళకు కావల్సినవి తీసుకోవాలని కక్కుర్తి. నన్ను చూస్తే భయం నాలో కొట్టుకుపోతారనేగా. వెనక్కు పారిపోయి, ఒడ్డున ఉన్నామనుకుని, ఎన్ని విషయాలలో కొట్టుకుపోతున్నారో తెలుసా వాళ్ళకు?"

యాత్రలో పాత్రలు గంగాజలాలు. ఫక్కున నవ్వింది పాపహారిణి గంగ..

"పాత్రలో నన్ను మూసిపెట్టి పూజలో పెట్టుకుంటారు. అవసరమైతే నా పవిత్రత వాడుకుందామని. కానీ శ్రద్ధ మందగిస్తుంది. మర్చిపోతారు. నేను స్మృతి కానీ, స్పర్శతో కాని, మంత్రంతో కాని స్పందిస్తానని మర్చిపోతారు."

నిజమే నీరు స్పృజించగానే, మంత్ర పూతంకాగానే ఒకరకమైన శక్తి ఎర్పడుతుంది. మామూలు నీరు ప్రార్ధన, ఆరాధన చెయ్యగానే మాలిక్యులర్ స్ట్రక్చర్ మారిపోయి అష్టదళ పద్మంగానో, అణువుల మార్పులతో అనేక రూపధారణ చేస్తుంది.

ఇంటర్ నెట్‌లో చదవడం గుర్తుకు వచ్చింది అలకనందకు. దారిలో పచ్చపచ్చటి పచ్చిక బైళ్ళు. హరిత గంగ. ఆనందంగా నడుస్తోంది వాటి మధ్య తల్లిలా స్పృశిస్తూ.

పాల్ కొహలానే మాటలు గుర్తుకు వచ్చాయి అలకనందకు. "భవనాలు కట్టేవాడు తను కట్టే గదుల మధ్య కుంచుకుపోతాడు. పచ్చని తోటలు పెంచేవాడు విస్తరిస్తూ విశాలమైపోతూ ఉంటాడు. అతని పని ఆగదు. అతని మనస్సు పచ్చదనంతో వ్యాపిస్తూనే ఉంటుంది."

గరుడ గంగలో పూజ చేసి రాళ్ళు తీసుకుంటున్నారు అందరూ. గరుడు అమృతము తీసుకెళ్ళేటప్పుడు అక్కడ కొంత చిందింది. నాగదోష నివారణకు ఆ రాళ్ళను పూజలో పెట్టుకుంటారట.

"నిజమా?" గంగను ప్రశ్నించింది అలకనంద.

నవ్వింది అమృతవాహిని గంగ.

"నా ప్రవాహమంతా అమృతమయమే. పోనీ రాతి జ్ఞాపకాలతో నన్నా, వీళ్ళలో అమృత తత్వం మేలుకుంటే - ఆశల సర్పాల కాటు తప్పించుకుంటారేమో. అసలు విషయం తెలుసా? గారుడం మంత్రి పీఠాలను దుష్టశక్తులనుంచి రక్షిస్తుంది. సంకల్పించి పెడితే అంత మహాత్యం ఉన్నది వాటికి.

"అమ్మమ్మగారూ గారుడం అంటే అంటే?"

గరుడ గంగకు పూజ చేస్తున్న ఆమెను అడిగింది.

"ఔను గరుడ మంత్రం పీఠరక్షణకు ఉపయోగిస్తారు.. ఇది మంత్రవేత్తలకు మాత్రం తెలిసిన రహస్యం. నీకు చాలా తెలుసే" అన్నారు అమ్మమ్మగారు నవ్వుతూ.

"నా ముఖం తెలుసు" జ్ఞానగంగకు తలవంచి నమస్కరిస్తూ అనుకున్నది అలకనంద.

ప్రమాదకరమైన ఘట్టాల వద్ద హెచ్చరికలు.

"నీ నీటిలో భయంకర జలచరాలుంటాయి. స్నాన ఘట్టాలలో మాత్రం అభయ గంగవు ఎలా అవుతావమ్మా? అడిగింది అలకనంద.

"భగవంతుడి ఆదేశం. కాశీలో కాలభైరవుడి రక్ష. నేను ఉత్తర వాహిని అయి తిరిగి చూచినప్పుడల్లా అక్కడ స్వామికి నామ రూపాలతో ఆరాధనాలయం ఉంటుంది. ప్రతి భక్తిపూరితమైన దోసిలిలో, మంత్ర పూరితమైన కమండలంలో భక్తి గంగనై ఆర్ద్రాభిషేకం, అనురాగాభిషేకం, స్పర్శాభిషేకం చెయ్యాలిగా నా స్వామికి. మరి భక్తులు నాలో అడుగుపెట్టాలంటే భయముండకూడదుగా. భయమున్న చోట ప్రేమ ఉండదు. ప్రేమలేని అభిషేకం నా స్వామి అంగీకరించరుగా. అందుకే అభయ గంగగా మారుతాను."

భీష్మ గంగ.

"ఈ గంగాస్నాయువుల్లో మహాత్ముడైన భీష్ముడు ఆడుకున్నాడు కాబోలు." నమస్కరిస్తూ అన్నారు అమ్మమ్మగారు.

"నిజమా?" అన్నట్లు గంగను చూసింది అలకనంద.

"నాలో ఒక రూపం శంతనుని ప్రియురాలు. ఔను. నేను ఈ హిమాలయాల్లో, సాధారణ మానవుల్లోని జడత్వాన్ని దూరం చేసి, చైతన్యాన్ని ఊపిరిగా పోసి పెంచాను భీష్ముణ్ణి. "

"ఎంత గొప్ప బిడ్డ తల్లి నీవాడు? సర్వేశ్వరానుగ్రహం, విశ్వరూప దర్శనం, విష్ణు సహస్రనామ సంకీర్తనం, స్థిత ప్రజ్ఞత్వం -"

"ఊఁ!" గర్వంగా నవ్వింది భీష్మమాత.

"గంగాపుత్రుడికి సర్వేశ్వర తత్వం అర్థం కాకపోతే మరెవరికి ఆ అదృష్టం? సాక్షాత్ సర్వేశ్వరుడైన విష్ణుపాద స్పర్శతో విష్ణుగంగగా ఎదుగుతూ, అందాందాల షట్చక్ర ఛాలనతో సృష్టి పద్మాలను వివేశింపచేస్తూ పతాత్పరుడైన విశ్వేశ్వరుడి సహస్రార స్పర్శతో పులకించిన గంగ కోరి, రూపుదాల్చి, చైతన్యమిచ్చిన బిడ్డ ఎలా ఉంటాడు మరి?! నా బిడ్డ మీ కుదించుకుపోయిన కథలకు, కథకులకు ఇంకా అర్థం కాలేదు" నిట్టూర్చింది నిరాశతో గంగ.

నిరాశ కాక ఏమౌతుంది పాపం?!

అహంకారాల బూడిదగా మారిన సగరులను పునీతం చెయ్యడానికి భగీరథ తపఃప్రయత్నములో విష్ణుపాదాన్నే వదిలి ఇలకు వచ్చి శంకరుడి ప్రియ సమాగమనంతో పులకించిపోయింది. కానీ కర్తవ్యం కోసరం శాశ్వతత్వం నుంచి ప్రవాహమైనది. మహా పావని. కానీ, చాలాసార్లు పాపాల బూడిదల మీద ప్రవహించక తప్పడం లేదు మరి.

బదరీలో విష్ణుపాద స్పర్శతో సజీవ గంగ. పర్వత రూపాలైన నరనారాయణుల మధ్య ఒరిసి పారుతూ బ్రహ్మ కపాలంలో వైతరిణిని దాటించి పితృదేవతలకు స్వర్గారోహణం కలిగించిన నారద గంగ.

జోషీ మఠేలో శంకర బగవత్పాదుల వారిని రప్పించుకుని పునఃప్రతిష్ఠ పొంది నంబూద్రిల పరసురామ పరంపర తంత్ర పద్ధతులతో పవిత్ర మంత్ర, తంత్ర, పవిత్ర రక్షణతో అనుగ్రహమిచ్చే, బదరీనాథుడు. ఆయన వెనుక భాగంలో ప్రవహించే ముక్తిదాయిని గంగ.

ఎంత మంది జనం? ఎంత తొక్కిసలాట?

కేవలం పిండ ప్రదానాలతో తద్దినాల పీడ ఒదిలించుకుందామనుకునే జనం.

తిడుతున్నారు ఎవరో.

"నిజంగా అన్ని ఆత్మలకు విముక్తి ఇస్తావా తల్లీ?" అడిగింది అలకనంద.

నవ్వింది ముక్తప్రదాయిని.

"ఇవ్వగలను. కానీ ఆ ఆర్ఘ్యప్రవాహంలో ప్రేమ. ఆర్ధ్రత, మనస్సు కరిగి ప్రవహించే కన్నీరు. ఇవి కలిస్తే కానీ నేను అనంతలోకాలకు వాహికను కాలేనే. మీ సంకల్పమే కారణం. అక్కడ చూడు. కక్కుర్తి, నేనే చేశానని చెప్పుకోవాలన్న ఢాంబీకం, లెక్కలు ఒక్కసారైనా ఊహ మమైకం అయితే నన్ను చేరుతుంది మరి. ఏదీ? జరగదేం?

ఎంత దురదృష్టం? యాత్రలు చేసి ఈ పాత్రలు ఖాళీగా వెనక్కు వెళతాయన్నమాట.

"నేను షూస్ విప్పను. గంగేమిటి? ఇదంతా డర్టీవాచ్" కాన్వెంటు చదువుల ప్రభావంతో అరుస్తున్నాడు తల్లిమీద ఒక కుర్రాడు. బ్రతిమాలుతోంది తల్లి.

అనుభవించేది మామగారి ఆస్థి. ఎన్ని మతలబులతో ఆయన సంపాదించాడో? ఎట్లాగూ తద్దినాలు పెట్టలేము ఇక్కడ పిండప్రదానం చేసేస్తే కొంత పీడ ఒదులుతుందేమో? ఇది ఆ తల్లి మనసులో దుగ్ధ. కానీ పీజాలు, కొక్కోకోలాలు, పబ్‌ల మధ్య పెరుగుతున్న బిడ్డలకు ఈ విషయలు ఎలా చెప్పాలో తెలియని తల్లి.

"ఏం జరుగుతుంది ఈ వాటర్‌లో స్నానం చేస్తే? రోగాలు వస్తాయి అంతే. " మరింత రెచ్చిపోతున్నాడు కొడుకు.

"గంగ అంటే ఏమిటనుకున్నావు? నోరుమూసుకుని స్నానం చెయ్యి." అనలేని బలహీనురాలు తల్లి. టీ.వి వాళ్ళు నిర్వహించే క్విజ్‌లో రాముడి తండ్రి ఎవరు? అని అడిగితే శంతన మహారాజు అని చెపితే వినే కల్చర్‌లో ఉన్నాము మనం.

"మీ దేశపతనానికి మీ ఆడవాళ్ళ అజ్ఞానం, బానిసత్వం కారణం. ఆడవాళ్ళకు తెలివిని, జ్ఞానాన్ని ఇవ్వని మీకు సంస్కారం అనవసరం" అని లైబ్రరీలు తగలపెట్టించాడన్న నాదిర్ షా కథ గుర్తుకు వచ్చింది అలకనందకు.

మంచినీళ్ళు బాటిల్ మడిగా తెచ్చుకుని, పట్టుబట్ట మడితో అందర్నీ దూరం, దూరం అంటూ ఇబ్బంది పెడుతూ.

"అయినా అంతా అంట్ల మంగలమైపోయింది. అన్ని జాతివాళ్ళూ గంగాస్నానాలే. ఒక కట్టుబాటూ లేదు, పాడూ లేదు" గట్టిగా తిట్టుకుంటూ ఒడ్డున నిలబడి అరుస్తోంది ముసలమ్మ.

పెద్ద అలగా ఒక్కసారి ఉప్పొంగి ఆవిడ అజ్ఞానంతో సహా తనలోకి లాగేసింది చిలిపి గంగ.

అంతా గోల గోల

ఒడ్డుకు లాగి ఉపచర్యలు చేస్తున్నారు చాలామంది.

"పిన్నిగారు! మీ గొంతులో గంగపోస్తున్నదెవరో తెలుసా? ఇక్కడి మత్స్య గంధి. ఆవిడకు గంగకు తేడాలేదు మరి. మింగుతారో లేదో మీ ఇష్టం" చిలిపిగా హెచ్చరిస్తూ కారెక్కారు అమ్మమ్మగారు.

పకపకా నవ్వింది కులమత బేధరహిత మహాపావని వృద్ధగంగ.

పంచపాండవుల ఆఖరి పయనం, ద్రౌపది భూవలయంలో ఆగిపోయినచోటు. అందుకే ఆవిడ పిలిస్తే ఆడవారికి పలుకుతుందేమో. సరస్వతీ నది అంతర్వాహిని అయిన స్థలం.

ఎంత అద్భుతమైన దేశం నాది? ఎంత ఇతిహాసమున్నది ఇక్కడ. చేతులు రెండు చాచి ఒక్కసారి భారతావనిని అక్కున చేర్చుకోవాలన్నంత మాతృత్వం పొంగింది అలకనందలో.

"ఆ ప్రేమే నాది. అర్థమయ్యానా నేను?!

నవ్వింది ఆర్ద్రమాతృరూపిణి అమ్మ గంగ.

అక్కడ అంతా మిలటరీ చేతుల్లో పర్యవేక్షణ. కొండరాళ్ళు దొర్లిపడి కొన్నిగంటలు ఆగిపోయింది ప్రయాణం. ఇటు పరమోన్నతమైన హిమాలయాలు, అటు అతిలోతైన లోయలో గంగా ప్రవాహం.

కారుజారినా, కాలుజారినా గంగమ్మ ఒడే "ఇక్కడ మాత్రం గంగ నిశ్శబ్దంగా ప్రవహిస్తుంది, హోరు ఉండదు ఆశ్చర్యంగా" చెపుతున్నాడు గైడ్

ఆశ్చర్యంగా చూసింది అలకనంద గలగల వంక. గంగాఝరి ఆపడమే? ఎందుకలా?

"ఎక్కడ మహాత్ములు ధ్యానంలో ఉండి, సర్వేశ్వరుడితో మమైక్యమవుతారో అక్కడ నేను నిశ్శబ్దవాహినిని - వారి ధ్యానాశీస్సులను నాలో కలుపుకుని అందరికీ ఇవ్వాలని నిశ్శబ్దంగా ప్రవహిస్తాను. " అంతర్ముఖి అయింది గంగ.

అమ్మమ్మగారు జపం చేసుకుంటున్నారు.

"అలకనందా! ఈ ప్రదేశమంతా పంచదశాక్షరీ రూపుదాల్చి ప్రతిధ్వనిస్తుంది. మనసు అవనితం చేసి ప్రార్ధించుకో. సమయం వృధా చేసుకోకు. ఈ ప్రదేశం, ఈ కాలం మళ్ళీ సిద్ధించవు"

అమ్మమ్మగారు హెచ్చరించారు ఆప్యాయత నిండిన గొంతుతో.

ఏం ఋణం ఇది? ఎందుకింత వెలుగు ఈమెలో. కళ్ళుమూసుకుంటే నురగల నగలతో, అలల చీరతో సౌందర్య లహరి, రాగఝరిగా ప్రత్యక్షం. ఆమెనాదమే గౌరీ పంచాక్షరీ మంత్రమా? ఇది మానసిక ఉపదేశమా?!

"అమ్మా! నువ్వు నిజమా?"

జలజలా కాంతి ముత్యాల ఝరిలా నవ్వింది జలరాణి."నేను మాట్లాడే అనుభూతులు ఆత్మపరమైనవి. పాంచభౌతిక శరీరానికి లోబడే బయాలు బట్టబయలు అయితే, అజ్ఞానమనే అగ్గి అంటుకోగానే, మీ అనుభూతుల వంతెనలు అన్నీ విభూది వంతెనలే. అందుకే అంతా ఉన్నట్లుగా మాయ ఊపిరి వదలగానే చెదిరిపోతుంది."

"ఎందుకు ఇంత విచ్చుకున్నవాళ్ళం ఒక్కసారి కుంచుకుపోతామమ్మా?"

"మహత్తు తెలియక, మహామన్వితత్వం అర్థంకాక ఆకాశం, గంగ వీటికి అంతం, కాలపరిమితి లేవుగా - నువ్వు, నీ జీవితం, నీ ఆలోచనలు, నీ ఆస్తులు, ఆవేశాలు - ఎక్కడ నిలబడతాయి ఈ అద్భుతం ముందు?

జీవితానికి విశాలత్వం తెచ్చుకోవాలి అనుకున్నప్పుడల్లా గంగను తలుచుకో. మంత్రాన్నై నీలో ప్రవహిస్తాను. కేవలం స్మరణ చాలును. నా ఔన్నత్యం, నా స్వామి విభూది తత్వం నిన్ను, నీ కాంతి శరీరాన్ని వెలిగించి, అతీత తత్వంలోకి అడుగుపెట్టించగలను."

నిశ్శబ్ద ధ్యానంలోకి జారిపోయింది అలకనంద.

"నీకొక రహస్యం చెపుతాను. మీలో ఉండే నా ఉనికిని చాలామంది గుర్తించలేరు. అమృతనాడిలో ప్రవహించేది నేనే".

"అమృతనాడి" అప్రయత్నంగా ఉచ్చరిస్తోంది అలకనంద.

"ఓం నమో భగవతే అశేష తీరాలవారే శివారులూ ఝూటవాలే హాం క్లీం సీః గంగే గంగే గంగాంబికే స్వాహా"

పెద్ద బొట్టుతో, పచ్చటి రంగుతో పళ్ళబుట్టలా ఉన్న అమ్మమ్మగారు నవ్వుతూ గంగ నీళ్ళు అలకనంద మీద చల్లుతున్నారు. ఆవిడ అసలు పేరు ఏదన్నా కానీ, ఆమె గురువులు ఇచ్చిన ఉపదేశనామం బాలాత్రిపుర సుందరి.

ఆకుపచ్చ పెద్దంచు పట్టుచీరతో, గంగలో నిలబడిన ఆమె గంగకు మరొకరూపమా? అన్నట్లు ఉన్నారు.

గంగను వదిలిపెట్టలేక తిరిగి చూస్తూ, మనసునిండా అమృత గంగా ప్రవాహంతో తిరుగుప్రయాణం.

స్విచ్ ఆఫ్ చేసిన మొబైల్ అప్పుడు గుర్తుకు వచ్చింది అలకనందకు.

ఎన్ని ఎస్.ఎమ్.ఎస్‌లు!!

"నిన్ను నేను ఎవరికోసరమూ వదులుకోలేను. నీ కోసరం ఎదురుచూస్తున్నాను" ఈ భావంతో, జవాబు రాకపోయినా ఆర్తితో పంపిన సందేశాలు.

నవ్వొచ్చింది అలకనందకు. అది భౌతిక ఆనందం మామూలు అనుభూతుల్ని నియంత్రిస్తుందా? అదివరకైతే, ఎగిరి గంతులు వేసేదేమో ఇప్పుడు? ఏమంటారు ఈ ప్రశాంతతని.

యాత్ర అంతర్ముఖమైనప్పుడు చుట్టూ అంతా మామూలు వ్యవహారాలు జరిగిపోతున్నా - అద్భుత ఝరి అంతర్లీనంగా ఊర్ధ్వముఖమై ప్రవహిస్తూనే ఉంటుంది!

"అమ్మమ్మగారూ!" మెల్లిగా అడిగింది రైల్లో.

"ఏమిటమ్మా?" ఆ గొంతులో ఆప్యాయతల గంగా ప్రవాహం.

ఎక్కడ లేవు నువ్వు?

నవ్వుకున్నది అలకనంద.

అడిగింది "అమృత నాడి" అంటే?

"ఎవరు చెప్పారు నీకు? ఏం తెలుసు నీకు?" పరిశీలనగా చూస్తూ అడిగారు.

"జ్ఞానగంగ."

కళ్ళు మూసుకుని - చేతులు జోడించారు ఆ వృద్ధ ఉపాసిని. ఆమె కంటిలో నీరు. ఆనందంతో ముఖం వెలిగి పోతోంది.

"అది అది భౌతిక ఉపదేశం. శ్రీ రమణ మహర్షుల వంటి చాలా తక్కువమందికి తెలిసిన రహస్యం. నువ్వు చాలా అదృష్టవంతురాలివి. అమృతనాడిని సుషుమ్న నాడి అని చాలామంది భ్రమపడతారు. "కాదు అది నేను" అని చెప్పింది ఆ తల్లి నీకు ఇంటికి వెళ్ళాక నీకు ఆ దశమహావిద్యాస్వరూపిణి ఏమిటి నీకు చెప్పాలో నాకు ఉపదేశమిస్తుంది. ఆవిడే నీ గురు స్వరూపిణి గంగ."

పులకించిపోయింది అలకనంద.

రాగద్వేషాలకు అతీతమైన ఆనందం ఏమిటో ఆమెకు అర్థమైంది.

ఓం నమో భగవతే

స్మరణం, మననం, ధ్యానం.

అంతా వెలుతురు వెల్లువే.

జ్ఞాన గంగా ప్రవాహమే. చేతులు జోడించి, అంతఃదృష్టితో అమృత వాహినీ దర్శనానికి ప్రయత్నిస్తోంది అలకనంద.

*ఈ కథలో అమ్మమ్మగారి పాత్రకు స్ఫూర్తిని ఇచ్చిన శ్రీమతి పిడపర్తి అనంతలక్ష్మిగారికి కృతజ్ఞతలు.*